


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

13.09.2026

ఆదివారం |రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 75

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధం

- 'గ్లోబల్ సౌత్' నిర్ణయాలు
- తీసుకునే స్థాయికి ఎదగాలి
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ
- 'రూల్ టేకర్' కాదు, 'రూల్ షేపర్'గా మారాలి
- బ్రిక్స్ వేదికపై మోదీ పిలుపు





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

రెండు రోజుల పాటు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో సహా ప్రపంచ దేశాల నాయకులకు ఆయన ఘన స్వాగతం పలికారు. ప్రారంభోపన్యాసం చేసిన ఆయన నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. 'భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను ప్రజలే కేంద్రంగా, మానవత్వమే ప్రథమ ప్రాధాన్యంగా నిర్వహించింది' అని తెలిపారు. ఇందులో భాగంగా స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలను ముఖ్యమైన ప్రాధాన్యతలుగా ఎంచుకున్నట్లు వెల్లడించారు. 2లో..

## ఒకరి నుంచి మరొకరం

# నేర్చుకోవచ్చు

- ప్రధాని నరేంద్ర మోడీతో భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- ఏడు సంవత్సరాల తర్వాత భారత్‌లో పర్యటన
- బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనేందుకు భారత్ వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీతో, జిన్‌పింగ్ శనివారం భేటీ అయ్యారు. భారత్, చైనాలు తమ పరస్పర బలాల నుంచి నేర్చుకుని, ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి సాధించగలవని అన్నారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోడీతో చైనా అధ్యక్షుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైనాభారత్ ద్వైపాక్షిక సంబంధాలు, సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక అంశాలపై రెండు దేశాలు చర్చించినట్లు తెలుస్తోంది. 2లో..

# పొంగులేటివన్నీ పచ్చి అబద్ధాలే

- పొంగులేటి ఆరోపణలకు హరీశ్‌రావు కౌంటర్
- 22ఏపై ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తాం
- అందుకే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు
- మామ భూములు గజ్వేల్‌లో ఉన్నాయి
- చట్టబద్ధంగానే భూమి రిజిస్ట్రేషన్
- పొంగులేటి తప్పులు కప్పిపుచ్చుకునేందుకే బురదజల్లుడు
- ఉద్యోగుల వేతనాల్లో కోతలు దుర్మార్గం
- G.O.1181ను వెంటనే రద్దు చేయాలి





హైదరాబాద్, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు తన పరపతిని ఉపయోగించి వేల కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేశారన్న మంత్రి పొంగులేటి వ్యాఖ్యలకు హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. శనివారం (సెప్టెంబర్ 12) ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో మంత్రి పొంగులేటి అన్ని అబద్ధాలే చెప్పాడన్నారు. 22ఏతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 22ఏపై ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తామనే భయంతోనే మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో మేం లేకుండా చేసి పొంగులేటి పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. మేం అడిగిన ఒక్క ప్రశ్నకు పొంగులేటి సమాధానం చెప్పలేదని విమర్శించారు. అసలు ఎన్ని ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారో ప్రభుత్వం చెప్పనే లేదని వ్యాఖ్యానించారు. 2లో..

రైతుల వ్యవసాయ భూములను పొరపాటుగా నిషేధిత జాబితాలో చేర్చామని అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి ఒప్పకున్నారు. కానీ ఇందుకు క్షమాపణలు చెప్పకుండా ఆయన తప్పించుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నివాసం కూడా 22ఏలో ఉందన్నారు కదా.. ఆయన ఇళ్లును ఎప్పుడు తీసేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో తన మామ పేరిట హరీష్‌రావు అసైన్డ్ భూములు పట్టా చేసుకున్నారన్న మంత్రి పొంగులేటి ఆరోపణలను హరీష్‌రావు ఖండించారు.

## ప్రజలను

# అప్రమత్తం చేయండి

- ఏపీలో భారీ వర్షాలు, వరదలపై..
- అధికారులకు పవన్ దిశానిర్దేశం 2లో..
- వాగులు పొంగుతున్న వేళ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలి



అమరావతి, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ .. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు.

## చిన్మోయ్ కృష్ణదాస్ కన్నీరు



2లో..

## ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

- జగన్ హయాంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఎక్కడ? రైతులకు చేసిన సాయం ఎంత?
- బడ్జెట్‌లో కేటాయింపులు చూపించి.. రైతులకు మాత్రం నిధులు ఇవ్వని జగన్ సర్కార్
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి 2లో..



## ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు

- ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు
- ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు
- విజయవాడలో జేపీ నడ్డా



2లో..

## ఆదిలాబాద్ విమానాశ్రయం వేగంగా అడుగులు పడ్తున్నాయి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్, రామ్మోహన్‌తో సమావేశం అయ్యాను
- వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకం 2లో..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంతజనశక్తి న్యూస్

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైనట్లు తెలిపారు. ఈ భేటీలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎక్కడా నిర్లక్ష్యం ఉండొద్దు

- గణేశ్ ఉత్సవాలు.. శాంతిభద్రతల పరిరక్షణ
- హోంమంత్రి అనిత



2లో..

## బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

- సంక్షేమ శాఖ మంత్రి సవిత
- ఆత్మగౌరవం పెంచేలా రక్షణ చట్టానికి మెరుగులు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం 2లో..



## చట్టసభలపై నమ్మకం లేదా..?

- కేసీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్
- మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఏం అనుకోవాలి



2లో..

# నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాదు, 'గ్లోబల్ సౌత్ నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని, భారత్ నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉందని మోదీ ఉద్ఘాటించారు. ''మనం బ్రిక్స్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ ఏడాది బ్రిక్స్ సమ్మిట్ ఒక చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరిస్తోంది. మానవ జీవితంలో 20 ఏళ్ల వయస్సు అనేది పరిణతి, బాధ్యతలతో కూడిన ఒక కొత్త దశకు నాంది పలుకుతుంది. కలలకు బాధ్యతలు తోడై, సామర్థ్యాలకు కొత్త దిశ లభించే సమయం ఇది'' అన్నారు. ''భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత ప్రజల ప్రయోజనాలు, మానవత్వానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధానంపై ఆధారపడి ఉంది. స్థిరత్వం, వినూత్నత, సహకారం, సుస్థిరతలే మా ప్రాధాన్యతలు. వీటి ఆధారంగానే బ్రిక్స్ అధ్యక్షతను సాధారణ ప్రజలతో అనుసంధానించేందుకు మేము ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాం. ఈ ఆలోచనతోనే 350కి పైగా సమావేశాలను నిర్వహించాం, అలాగే దాదాపు 30 నగరాల్లో మీ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలికే అవకాశం మాకు లభించింది'' అని తెలిపారు. ''ఈ రోజు బ్రిక్స్ కూడా తన పరిణతి చెందిన (కమింగ్ఆఫ్ఏజ్) స్థితికి చేరుకుంది. గడిచిన 20 ఏళ్లలో ప్రపంచ వేదికపై బ్రిక్స్ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి దృక్పథాలను మరొకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు; అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే మన నైజం.'' అని వివరించారు.

# ఒకరి నుంచి మరొకరం నేర్చుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు చేసిన సానుకూల వ్యాఖ్యల్ని ప్రధాని మోదీ స్వాగతించారు. భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో చైనా అందించిన సహకారానికి మోదీ థాంక్స్ చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ సమావేశం అవకాశం కల్పించిందని అన్నారు. తన పుట్టిన రోజైన జూన్ 15న భారత పర్యటనకు తనకు ఆహ్వానం వచ్చిందని జిన్‌పింగ్ తెలిపారు. గతంలో మోదీతో 21 సార్లు భేటీ అయినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశాల్లో కుదిరిన పలు ముఖ్యమైన అవగాహనలు భారత్‌చైనా సంబంధాలను స్థిరమైన అభివృద్ధిలోకి తీసుకెళ్తాయని అన్నారు.

ఒకరి నుంచి మరొకరం నేర్చుకోవచ్చు..

భారత్, చైనాలు ఒకరి బలాల నుంచి మరొకరు నేర్చుకోవడం, పూర్తిగా అర్థం చేసుకోవడం ద్వారా రెండు దేశాలు ఉమ్మడి విజయాన్ని, అభివృద్ధిని సాధించవచ్చని జిన్‌పింగ్ అన్నారు. చైనా ఎప్పుడూ భారత్‌తో సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో చూస్తాయని చెప్పారు. ప్రపంచంలో చోటుచేసుకున్న పరిణామాలు గత శతాబ్ధకాలంలో ఎప్పుడూ చూడలేదని, ఈ సవాళ్ల మధ్య ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక దేశాలుగా ఉన్న భారత్, చైనాలకు ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని అన్నారు. మానవాళి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రెండు దేశాలు కలిసి పనిచేయాలని జిన్‌పింగ్ సూచించారు.

# ప్రజలను అప్రమత్తం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు. గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అలర్ట్ చేశారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# చట్టసభలపై నమ్మకం లేదా.?

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, అనంతనశక్తి న్యూస్**

బీఆర్ఎస్‌పై తెలంగాణ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నిర్వహించింది మాక్ అసెంబ్లీ కాదని.. డెమోక్రసీని గులాబీ పార్టీ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు. శనివారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి సీతక్క చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్ నిర్వహించి, ఆ పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే గులాబీ పార్టీ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆగ్రహించారు.

బీఆర్ఎస్‌ది ఆధిపత్య దురంహంకారం..

ఇంకా ఆ మైలపోలేదనే ఆధిపత్య దురంహంకారంతో ఆ పార్టీ నేతలు ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్... మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభలపై ,సొంత పార్టీ కార్యక్రమంపై ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. అధికారంలో ఉంటే సచివాలయానికి రారని.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి కూడా రారా అని నిలదీశారు. ఫాంహౌస్‌ని సచివాలయంగా.. పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్నారు..

ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ పెట్టడమంటే వారు ఉన్నదగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనమని మంత్రి మండిపడ్డారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా అధికారం పోయినా.. దొర అహంకారం ఇంకా పోలేదని ఎద్దేవా చేశారు. స్పీకర్‌ను, చట్ట సభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# చిన్మోయ్ కృష్ణదాస్ కన్నీరు

- **తల్లి అంత్యక్రియల సమయంలో..**
- **బంగ్లాదేశ్‌లో కస్టడీలో ఉన్న చిన్మయ్**
- **కృష్ణదాస్‌పై సువేందు అధికారి వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

బంగ్లాదేశ్ కస్టడీలో ఉన్న హిందూ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్ అంశాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రస్తావించారు. చిన్మోయ్ తన తల్లి అంత్యక్రియలకు హాజరైన సమయంలో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడియో దేశవ్యాప్తంగా వైరల్‌గా మారింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులు పడుతున్న కష్టాలను ఈ కన్నీళ్లు చెబుతున్నాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం కేవలం 5 గంటల పెరోల్ ఇచ్చి, తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనుమతించింది. ఇదిలా ఉంటే, ఈ అంశంపై సువేందు అధికారి మట్లాడుతూ.. తన తల్లి అంత్యక్రియలకు హాజరైన సమయంలో చిన్మోయ్ కృష్ణదాస్ పెట్టుకున్న కన్నీళ్లు ప్రపంచవ్యాప్తంగా సనాతనవాదుల్ని కదిలించాని అన్నారు. బెంగాల్ విభజన, హిందువుల భద్రతకు సంబంధించిన చారిత్రక అంశాలను అధికారి ప్రస్తావించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానంద వంటి నేతల పోరాటం వల్ల బెంగాల్‌లో కొంత భాగం భారత్‌లో విలీనం అయిందని అన్నారు. ఒక వేళ విలీనం కాకపోయి ఉంటే, ఈ రోజు మన పరిస్థితి కూడా చిన్మోయ్ కృష్ణదాస్ పరిస్థితి లాగే ఉండేదని అన్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయం వేగంగా అడుగులు పడ్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. దీనికి సంబంధించిన కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్‌కు డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ కనెక్టివిటీకి సంబంధించి విమానాశ్రయం, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని కేంద్ర మంత్రులకు వివరించినట్లు తెలిపారు. రీజినల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్నీ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారన్నారు. అలాగే ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని కిషన్ రెడ్డి తెలిపారు. మరోవైపు, ఈ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం నేడు తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, తెలంగాణ అధికారుల మధ్య ఇప్పటికే పలు సమావేశాలు జరిగాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు 17 ఏప్రిల్ 2026న విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని వారు నిర్ణయించారని తెలిపారు. దీంతోపాటుగా ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా ఫెసిలిటీస్ ఏర్పాటు చేస్తామన్నారు.

అలాగే పౌర సేవలకు సంబంధించి సివిల్ టెర్మినల్‌తో పాటు నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాల కేంద్రాన్ని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేస్తుందన్నారు. వీటితో పాటు అక్కడ పనిచేసే ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారని కిషన్ రెడ్డి చెప్పారు.

# ఏపీ ఆరోగ్య రంగానికి రూ.64,100 కోట్లు

**అమరావతి, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా.. ఏపీ ఆరోగ్య రంగానికి కేటాయింపులపై కీలక ప్రకటన చేశారు.. విజయవాడలోని ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించిన జేపీ నడ్డా.. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ దేశవ్యాప్తంగా ఆరోగ్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కోవిడ్ సమయంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.64,100 కోట్లు ఖర్చు చేస్తున్నామని జేపీ నడ్డా వెల్లడించారు. రాష్ట్రానికి 24 క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, 26 ల్యాబొరేటరీలు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో ఆయుష్మాన్ ఆరోగ్య సేవా మందిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**కాంప్రహెన్సివ్ హెల్త్ కేర్‌పై దృష్టి**

2017లో కొత్త హెల్త్ పాలసీని తీసుకొచ్చామని నడ్డా తెలిపారు. కేవలం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే క్యూరేటివ్ హెల్త్ కేర్ విధానం నుంచి కాంప్రహెన్సివ్ హెల్త్ కేర్ వైపు భారత్ ముందుకు సాగుతోందన్నారు. గతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యంపై ఎక్కువగా ఆధారపడేవాళ్లమని, ఇప్పుడు నివారణ, ముందస్తు గుర్తింపు, సమగ్ర ఆరోగ్య సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. వంటగది కూడా ఒక ఫార్మసీలా పనిచేస్తుందని, ఆహారమే ఔషధంగా ఉండేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక, దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు 140 కోట్ల మంది ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలకు తొలి ఆధారంగా నిలుస్తున్నాయని నడ్డా తెలిపారు. ఏపీలో ఇంద్రధనుష్ వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. హైపర్‌టెన్షన్ కోసం 42 కోట్ల మందికి స్క్రీనింగ్, 36 కోట్ల మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు.

**టీబీ నియంత్రణలో భారత్ పురోగతి**

భారతదేశంలో ట్యూబర్క్యులోసిస్ కేసులు 21 శాతం తగ్గాయని నడ్డా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా టీబీ తగ్గుదల 11 శాతంగా ఉంటే, భారత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించామని చెప్పారు. ఆరోగ్య సేవలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే ప్రభు

# బీసీల ఆత్మగౌరవం పెంచేలా చంద్రబాబు పాలన

**విజయవాడ సెప్టెంబర్ 12, అనంత జనశక్తి ప్రతినిధి**



బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు పాలిస్తున్నారని, ప్రజల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు గర్వంతో తలెత్తుకుని వెళుతున్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో తమదే విజయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ధీమా వ్యక్తంచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరుతామని స్పష్టంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కోర్టుల్లో నిలబడేలా బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో వివిధ బీసీ కార్పొరేషన్ చైర్మన్లతో శనివారం బీసీ రక్షణ చట్టంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలంటేనే టీడీపీ అని స్పష్టంచేశారు. బీసీల ఆత్మగౌరవం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు పాలిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోర్టుల్లో బలంగా నిలబడేలా ఈ చట్టానికి తుదిమెరుగులు దిద్దుతున్నామన్నారు. దీనిలో భాగంగా మంత్రివర్గ ఉప సంఘంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణలు చేసినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండు నెలల్లో కేసుల దర్యాప్తు పూర్తి చేసేలా నిబంధనలు రూపొందించామని తెలిపారు. బీసీ రక్షణ చట్టాన్ని కోర్టుల్లో నిలబడేలా రూపొందిస్తున్నామన్నారు. ఇప్పుడు 156 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలోనే బీసీ రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. 19987 అన్న ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు రిజర్వేషన్లకు అమలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతానికి రిజర్వేషన్లు పెంచారన్నారు. 2019 తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ ...బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించారన్నారు. గొడ్డలి పార్టీ చర్యతో బీసీలకు రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మరోసారి 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు.

ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నాం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 26 నెలల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అత్యధికంగా బీసీలే లబ్ధిపొందుతున్నారన్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజల్లోకి ధైర్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వెళ్లేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

త్వరలో ఆదరణ 3.0ను అమలు చేస్తామని మంత్రి సవిత తెలిపారు.

జగన్ కు ఓటమి భయం

సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోందని మంత్రి సవిత తెలిపారు. రాబోయేk స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానిదే విజయమని ధీమా వ్యక్తంచేశారు. జగన్ లో మరో ఓటమి భయం కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. బీసీ రక్షణ చట్టంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు, మంత్రి సవితకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సవితకు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మంత్రి సవిత... అన్న ఎన్టీఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, పలు బీసీ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట్ గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వరరావు, నర్సింహాయాదవ్, మల్లెల ఈశ్వర్, దేవేంద్రప్ప, చిలకలపూడి పాపారావు, కొల్లు పెద్ది రాజు, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది కదా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అంటే

**అమరావతి, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి ప్రతినిధి**

రైతు పండించిన పంటకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించి నష్టపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు, రైతుకు అండగా నిలిచి ధరకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడమే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పేరుతో పెద్దగా ప్రయోజనం కల్పించకపోయినా, భారీగా నిధులు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకున్నారని మంత్రి విమర్శించారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూపించడం, వాస్తవంగా రైతులకు నిధులు అందించడం మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఎద్దేవా చేశారు. రైతుల పంటలకు ధరలు పడిపోయినప్పుడు జగన్ ప్రభుత్వం ఎక్కడ ఉంది? రైతులకు ఎంత సాయం చేసింది? అని మంత్రి ప్రశ్నించారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చిత్తశుద్ధితో పనిచేసిందని మంత్రి తెలిపారు. వివిధ పంటలకు మద్దతు ధరల కోసం సుమారు రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా పొగాకు - రూ.271 కోట్లు, మామిడి - రూ.261 కోట్లు, ఉల్లి - రూ.125 కోట్లు, కోకో - రూ.14 కోట్లు, టమాటా - రూ.12 కోట్లు ఖర్చు చేసామని తెలిపారు. ఈ ఏడాది కూడా తోతాపూరి మామిడి, పొగాకు రైతులకు అండగా నిలిచామని వెల్లడించారు. మార్కెట్‌లో తోతాపురి మామిడి ధరలు పడిపోవడంతో రైతులకు అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున ధర లోటు భర్తీ చేసిందని మంత్రి తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల్లోని రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించామని చెప్పారు. మొత్తం 7.03 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తికి కిలోకు రూ.4 చొప్పున ధర లోటు చెల్లింపు చేసినట్లు మంత్రి వివరించారు. ఆఫ్‌స్టైల్, లోగ్రేడ్ పొగాకు రకాలను సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందించామని మంత్రి తెలిపారు. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న వేలాది మంది పొగాకు రైతులకు ఈ నిర్ణయం గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో రైతులను గాలికొదిలేశారు

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల పేరుతో ప్రచారం చేసుకోవడం తప్ప, పంటలకు ధరలు పడిపోయినప్పుడు వారికి అండగా నిలిచిన దాఖలాలు ఆ ప్రభుత్వానికి లేవు అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. 2020లో మార్కెట్ ధర సుమారు రూ.12,000గా ఉన్నప్పటికీ కేవలం రూ.7,000 మద్దతు ధర ప్రకటించి, దానిని అమలు చేయడానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతులకు నిజంగా ఎంత సాయం చేశారో చెప్పకుండా, కాగితాలపై భారీ మొత్తాలు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ 5 ఏళ్ల కాలంలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు రూ.2,140 కోట్లు బడ్జెట్ కేటాయించినట్లు చూపించి, వాస్తవంగా కేవలం రూ.1,475 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. అయితే రూ.7,700 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రచారం చేసుకోవడం వైసీపీ ప్రభుత్వ అసమర్థతకు, రైతుల పట్ల దాని నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 2025 2026 ఏడాదిలోనే 800 కోట్లకు పైగా రైతులకు ఖర్చు చేసామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను మాటలతో మోసం చేస్తే.. కూటమి ప్రభుత్వం చేతల్లో అండగా నిలుస్తోంది. వైసీపీ హయాంలో కాగితాలపై కేటాయింపులు, ప్రచారంలో వేల కోట్లు.. కూటమి ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లోకి వాస్తవంగా సాయం. ఇదే రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడా అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పంట ధరలు పడిపోయిన ప్రతిసారీ రైతు మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా మార్కెట్ ఇంటర్వెన్షన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, అవసరమైన సమయంలో ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతును ఆదుకోవడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు. రైతు కష్టపడి పండించిన పంటకు ధర రాకుండా పోతే కూటమి ప్రభుత్వం చూస్తూ చేతులు ముడుచుకుని కూర్చోదు. రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి సందర్భంలో మార్కెట్‌లో జోక్యం చేసుకుంటాం. నిధులు అవసరమైతే మరిన్ని నిధులు సమకూరుస్తాం. రైతు సంక్షేమమే మా ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# పొంగులేటివన్నీ పచ్చి అబద్ధాలే

(మొదటి పేజీ తరువాయి)

తన మామ భూములు ఉన్నది సిద్దిపేటలో కాదని.. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్నాయని క్లారిటీ ఇచ్చారు. మా మామ ఒక రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్ అని.. చెక్ ఇచ్చి లీగల్‌గానే ఆయన భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరణ ఇచ్చారు. మా మామ భూములు కొన్నప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని.. కావాలంటే అన్ని ఆధారాలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తాతముత్తాతల నుంచి వచ్చిన భూములను కూడా 22ఏలో పెట్టారని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు అయితే రాత్రికి రాత్రే సీఐని మార్చాడని ఆరోపించారు. పొంగులేటి ఆయన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నాపై బురద జల్లుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన అవినీతి, అసమర్థతను ప్రశ్నిస్తున్నామన్న ఆక్రోశంతో అగ్గిపెట్టే రావు అంటూ పొంగులేటి అవమానించేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటల్లో కోతలు.. ఉద్యోగుల వేతనాల్లో కోతలు.. ఇదేనా రేవంత్ రెడ్డి చెప్పే ప్రజా పాలన అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో 20-25 ఏళ్లుగా సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం దుర్మార్గమని మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హరీశ్ రావును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఉద్యోగుల వేతనాల్లో కోత పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 12.07.2026నాటి G.O.Rt.No.1181 ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఇన్నేళ్లుగా ప్రభుత్వ వ్యవస్థలో భాగంగా పనిచేస్తున్న ఉద్యోగుల సేవలు, అనుభవాన్ని గుర్తించాల్సింది పోయి.. కొత్త నిబంధనల పేరుతో జీతాలు తగ్గించడం అన్యాయమని మండిపడ్డారు. ఈ నిర్ణయం 31 వేల ఉద్యోగుల కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేతనాల పెంపు ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేతనాల్లో కోతలు ఉన్నాయని హరీశ్‌రావు మండిపడ్డారు. ఉద్యోగుల పట్ల ఎందుకు ఇంత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. ఉద్యోగుల వేతనాలు తగ్గించడం ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన అవుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే G.O.Rt.No.1181ను రద్దు చేయాలని, ఉద్యోగుల పూర్వపు హోదాను యథావిధిగా కొనసాగించాలని, వేతన రక్షణ కల్పించడంతో పాటు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీగా ఉన్న రెగ్యులర్ పోస్టుల భర్తీలో అర్హత, సుదీర్ఘ అనుభవం ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని BRS పక్షాన డిమాండ్ చేశారు.

# ఎక్కడా నిర్లక్ష్యం ఉండొద్దు

**అమరావతి, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**



గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత .. పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలోని పలు జిల్లాల ఎస్పీలతో హోం మంత్రి అనిత సచివాలయంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై ఎస్పీలతో సుదీర్ఘంగా హోం మంత్రి చర్చించారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు చేశారు. వినాయక చవితి ఉత్సవాలకు అనుమతుల జారీపై ఎస్పీలతో హోం మంత్రి అనిత మాట్లాడారు. ఈ ఉత్సవాల అనుమతుల కోసం అమలు చేస్తున్న సింగిల్ విండో విధానంపై ఉత్సవ కమిటీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏకదంతుడి మండపాలు, ఊరేగింపుల విషయంలో నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హోం మంత్రి దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో నిన్న జరిగిన శాంతిభద్రతల సమీక్షపై ఆయా అంశాలపై ఎస్పీలతో చర్చించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని ఎస్పీలకు.. హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# మదురై మీనాక్షి ఆలయం సమీపంలో భారీ అగ్నిప్రమాదం..

**- 86 ఏళ్ల పురాత సెంట్రల్ థియేటర్‌లో మంటలు**




తమిళనాడులోని మదురై మీనాక్షి సుందరేశ్వర ఆలయ పశ్చిమ గోపురం సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. 86 ఏళ్ల పురాతన సెంట్రల్ థియేటర్‌లో భారీగా మంటలు చెలరేగాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్నిప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేశారు.. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తమిళనాడులోని మదురై మీనాక్షి సుందరేశ్వర ఆలయం సమీపంలో అగ్నిప్రమాదం జరిగింది. అమ్మవారి ఆలయ పశ్చిమ గోపురం సమీపంలోని ఒక థియేటర్ ఉంది. కొన్ని రోజులుగా మూసి ఉన్న ఆ థియేటర్‌ను పార్కింగ్ సౌకర్యంగా, పిల్లల బొమ్మలను నిల్వ చేసే గోడౌన్‌గా ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో సెంట్రల్ థియేటర్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారి పొగ కనిపించి, వేగంగా మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే మంటలు వేగంగా భవనాన్ని చుట్టుముట్టాయి. నిమిషాల్లోనే దట్టమైన పొగ చుట్టుపక్కల వీధుల్లోకి వ్యాపించడంతో ఆలయ ప్రాంతంలో భక్తులు, స్థానికులు కంగారుపడ్డారు. సమీపంలోనే మీనాక్షి సుందరేశ్వర ఆలయ కుంభాభిషేకం కోసం యాగశాల కార్యక్రమాలు జరుగుతున్నసమయంలోనే అగ్నిప్రమాదం జరగంతో భక్తులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. దట్టమైన పొగ, మంటలు వేగంగా వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.. అగ్నిప్రమాదానికి కారణం తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

అగ్నిమాపక సిబ్బంది దాదాపు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేసినప్పటికీ.. రాత్రి పొద్దుపోయే వరకు సహాయక చర్యలు కొనసాగాయి. కేవలం 60% మంటలను మాత్రమే అదుపులోకి తీసుకురాగలిగారు. ప్రస్తుతం పార్కింగ్ సౌకర్యంగా ఉపయోగిస్తున్న ఆ థియేటర్‌లో ప్లాస్టిక్ సామాగ్రి కూడా నిల్వ ఉందని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

018లో మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో అగ్నిప్రమాదం జరిగింది. వేయికాళ్ల మండపం దగ్గర మంటలు చెలరేగగా.. ప్రమాదంలో 50కి పైగా షాపులు కాలిపోయాయి. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేశారు. ఆలయంలోని తూర్పు రాజగోపురం దగ్గర ఉన్న పూజాసామాగ్రి షాపులో అగ్నిప్రమాదం జరిగింది. ఆలయం మూసేసిన తర్వాత మంటలు చెలరేగాయి.. క్షణాల్లోనే చుట్టుపక్కలకు వ్యాపించాయి.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# ప్రియుడితో పారిపోయిన భార్య.. పట్టుకుని మరీ వారిద్దరికీ గుడిలో పెళ్లి జరిపించిన భర్త!




లక్నోలోని మలిహాబాద్‌లో భార్య ఇష్టానికి విలువనిస్తూ ఆమె ప్రియుడితో స్వయంగా పెళ్లి జరిపించిన పిఆర్‌డి జవాన్ ఉదారత వార్తల్లో నిలిచింది. ఏడాది క్రితం పెళ్లయినా.. పాత ప్రియుడితో హర్దోయీ ప్రాంతానికి పారిపోయిన భార్యను పోలీసులు గుర్తించగా.. ఆమె తన ప్రియుడితోనే ఉంటానని స్పష్టం చేసింది. దాంతో భర్త ఆమెను బలవంతపెట్టకుండా ఇరు కుటుంబాల సమక్షంలో ఆలయంలో వారిద్దరికీ శాస్త్రోక్తంగా వివాహం జరిపించి సాగనంపాడు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో జిల్లాలో అత్యంత అరుదైన, వింతైన సంఘటన వెలుగుచూసింది. తనను కాదని మాజీ ప్రియుడి వద్దకు వెళ్లిన భార్యను.. ట్రాక్ చేసి మరీ కనిపెట్టాడు. ఆపై ఆమె ఉన్న చోటుకు వెళ్లి.. భార్యను బలవంతపెట్టకుండా, ఆమె ఇష్టాన్ని గౌరవిస్తూ స్వయంగా వారిద్దరికీ వివాహం జరిపించి సాగనంపాడో భర్త. లక్నో పరిధిలోని మలిహాబాద్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ వినూత్న ఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..?**

మలిహాబాద్ ప్రాంతానికి చెందిన ఒక యువతికి ప్రొవిన్షియల్ రక్షక్ దళ్ (పీఆర్డీ) లో పనిచేస్తున్న జవాన్‌తో సుమారు ఏడాది క్రితం వివాహమైంది. అయితే సదరు యువతికి.. తాను బడిలో చదువుకునే రోజుల నుంచే ఓ యువకుడిపై ప్రేమ ఉండేది. అయితే ఆ అబ్బాయికి కూడా ఈమె ఇష్టం ఉండగా.. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఇద్దరూ కలిసే జీవితాంతం కలిసుండాలని నిర్ణయించుకున్నారు. కానీ కుటుంబ సభ్యుల తీవ్ర ఒత్తిడి, బలవంతం కారణంగా సదరు యువతి ఆ పీఆర్‌డీ జవాన్‌ను పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది. వివాహమైై భర్త వద్దకు వచ్చినప్పటికీ.. ఆమె తన పాత ప్రియుడితో సంబంధాలను కొనసాగిస్తూనే వచ్చింది.

**మంచిరోజు చూస్కొని మరీ ప్రియుడితో పరార్**

సుమారు నాలుగు రోజుల క్రితం ఆ యువతి భర్త ఇల్లు వదిలి తన మాజీ ప్రియుడితో కలిసి హర్దోయీ ప్రాంతానికి వెళ్లిపోయింది. భార్య కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, లొకేషన్ ఆధారంగా సదరు యువతి హర్దోయీలో తన ప్రియుడితో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిద్దరినీ తీసుకొచ్చి ఇరు కుటుంబాల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో పంచాయితీలో యువతి తెగేసి చెప్పింది. తనకు భర్తతో కలిసి జీవించడం ఇష్టం లేదని, తన పూర్వ ప్రియుడితోనే జీవితాన్ని పంచుకోవాలని ఉందని స్పష్టం చేసింది.

**ఆలయంలో ఘనంగా పెళ్లి.. సాగనంపిన భర్త**

యువతి నిర్ణయాన్ని విన్న పీఆర్‌డీ జవాన్ ఎంతో ఉదారతతో ఆలోచించాడు. ఇష్టం లేని బంధంలో ఆమెను బలవంతంగా ఉంచడం సరికాదని భావించి, ఆమె నిర్ణయానికి ఆమోదం తెలిపారు. ఇరువైపుల కుటుంబ సభ్యుల సమ్మతితో, అవసరమైన పోలీసు లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత వారిద్దరి పెళ్లికి అంగీకరించారు. స్థానిక ఆలయంలో హిందూ సాంప్రదాయాల ప్రకారం ఆ యువతికి, ఆమె ప్రియుడికి వివాహం జరిపించారు. ఇద్దరూ పూలమాలలు మార్చుకుని, ఏడడుగులు నడిచారు. ఆ తర్వాత భర్త స్వయంగా తన భార్యను ఆమె కొత్త భర్త (ప్రియుడు)తో కలిసి పంపించివేశాడు. భార్య ఇష్టాన్ని గౌరవించి, ఆమె సంతోషం కోసం పిఆర్‌డి జవాన్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# ఈ బొమ్మల ధరలు రూ.100 నుంచి రూ.8లక్షలు



రైతులకు ఎంతో నమ్మకమైన నేస్తాలైన ఎడ్లను పూజించే పండగ బైల్ పోలా. మహారాష్ట్రలోని తూర్పు విదర్భ ప్రాంతంలో ఈ పోలా మరుసటిరోజు జరుపుకొనే తాన్హా పోలా సంప్రదాయానికి ప్రత్యేక విశిష్టత ఉంది. ముఖ్యంగా పిల్లల్లో పశుసంపదపై ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహనను పెంచేందుకు నిర్వహించే ఈ పండగ ఈ ఏడాదితో 237 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నాగ్‌పూర్‌లోని లాకడ్‌గంజ్ మార్కెటు చెక్కతో చేసిన రంగురంగుల నంది బొమ్మలతో సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ఈ చెక్క ఎద్దులకు పిల్లల సమక్షంలో పూజలు చేస్తారు. తర్వాత పిల్లలకు ప్రసాదం, డబ్బులు పంచిపెడతారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ నంది బొమ్మల ధరలు సైజునుబట్టి రూ.వంద నుంచి రూ.8 లక్షల వరకు పలుకుతుండటం విశేషం.

# రష్యాతో భారత్ మైత్రిది చిరకాల చరిత్ర



రష్యాతో భారత్ సత్సంబంధాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత ఘనతగా చాటుకుంటున్నారని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. నిజానికి భారత రష్యాల మధ్య చిరకాలంగా బలమైన సంబంధాలున్నాయని, ఆ సంబంధాల పునాది 1950ల నుంచి 1980వ దశకం వరకూ బలోపేతమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భేటీ సందర్భంగా కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. "1950వ దశకంలో ప్రారంభమైన భారత అభివృద్ధి పయనంలో రష్యా అమూల్య భాగస్వామిగా కొనసాగుతోంది'' అని జైరాం రమేశ్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఉక్కు, భారీ ఇంజనీరింగ్, గనులు, విద్యుత్తు, చమురు సహజవాయువు, రసాయనాలు, రక్షణ, అంతరిక్షం తదితర రంగాల్లో భారత్ సాధించిన పురోగతిలో ఈ సంబంధం ఎంతగానో ఉపయోగపడిందని ఆయన అన్నారు.

**దేశాన్ని మీరు ముంచారు, మేం నిర్మించాం**

కాంగ్రెస్ దేశాన్ని ముంచేయగా తాము తిరిగి నిర్మించామని భాజపా శుక్రవారం పేర్కొంది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు సంబంధించి కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. దేశం సాధిస్తున్న పురోగతిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అధికార పార్టీ పేర్కొంది. యూపీఏ పరిపాలనలో 201112 కాలంలో భారత్ బ్రిక్స్‌లో తన స్థాయిని కోల్పోయే పరిస్థితి ఏర్పడగా నేడు ఆ కూటమి దేశాల అధినేతలకు భారత్ ఆతిథ్యం అందించే స్థాయికి చేరిందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ప్రపంచ యవనికపై గతంలో ఎన్నడూ లేనంత ఉన్నత స్థానాన్ని భారత్ నేడు పొందుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఒకే తరహా హెచ్చరిక వద్దు

**- అధిక, సాధారణ ప్రాసెస్డ్ ఆహార పదార్థాల మధ్య తేడా తెలియాలి: సుప్రీం కోర్టు**



ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలు అధికంగా కలిసి ఉంటే ప్యాకేజ్డ్ ఫుడ్ ఉత్పత్తుల గురించిన సమాచారం వాటి వినియోగదారులు అందరికీ సులువుగా అవగాహన కలిగించేలా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్నో ప్రాంతీయ భాషలు మాట్లాడే మన దేశంలో ప్రజల అక్షరాస్యత, అవగాహన స్థాయిలు కూడా భిన్నంగా ఉంటాయని చెబుతూ తినుబండారాలు, పానీయాల ప్యాకెట్ల ముందు భాగంలో ముద్రించేందుకు ప్రతిపాదించిన హెచ్చరికలు అక్షరాలకే పరిమితం కాకుండా చిత్రాల రూపంలోనూ అర్థమయ్యేలా ఉండాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్ ధర్మాసనం అభిప్రాయపడింది. ప్యాకెట్ల ముందు భాగంలోనే హెచ్చరికలను ప్రముఖంగా ముద్రించి దశల వారీగా దీనిని అమలుచేస్తామన్న భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అఫిడవిట్‌పై ధర్మాసనం మరిన్ని వివరణలను కోరింది.

**అమలుకు ఎంత సమయం తీసుకుంటారు?**

తొలి దశలో..ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలలో ఏవైనా రెండు అధికంగా ఉండే ప్యాకేజ్డ్ తినుబండారాలు, తీయటి పానీయాల ఉత్పత్తుల ప్యాకెట్లపై పోషక విలువల సమాచార ముద్రణను అమలు చేస్తామని ఎఫ్ఎస్ఎస్ఏఐ అఫిడవిట్‌లో పేర్కొంది. రెండో దశలో...ఈ మూడు ఆందోళనకర పోషకాల్లో ఏ ఒక్కటి అధికంగా ఉన్న ఉత్పత్తులనూ హెచ్చరికల లేబుళ్ల ముద్రణ పరిధిలోకి తీసుకొస్తామని వివరించింది. దీని అమలుకు ఎంత సమయం తీసుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. మితిమీరి, సాధారణ ప్రాసెస్ చేసిన తినుబండారాలు, అధిక చక్కెరను జోడించిన పానీయాలు, సాధారణ పరిమితికి లోబడి ఉండేవి, మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలేవో వర్గీకరించడంతో పాటు ఆ సమాచారం స్పష్టంగా తెలిసేలా, ఆరోగ్యంపై అవి చూపే దుష్ప్రభావం ప్రాతిపదికన హెచ్చరిక లేబుళ్లు కూడా భిన్నంగా ఉండాలని ధర్మాసనం తెలిపింది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎఫ్ఎస్ఎస్ఏఐ తన అఫిడవిట్‌లోని అంశాలను పునఃపరిశీలించుకుని పది రోజుల్లోగా మరింత స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. ప్యాకెట్ల ముందు వైపు ముద్రించే ఆహార పదార్థాల సమాచారం అక్షరాలతో పాటు చిత్రాల రూపంలోనూ సామాన్యులకూ, ఆన్‌లైన్ కొనుగోలుదారులకు అర్థమయ్యేలా ఉండాలని ధర్మాసనం నిర్దేశించింది.

**విద్యార్థులకు ఎలా అవగాహన కల్పిస్తారు?**

ప్యాకేజ్డ్ ఫుడ్‌లో మితిమీరి ప్రాసెస్ చేసిన ఆహార దినుసులు, రుచికోసం అధికంగా వినియోగించే చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు చిన్నారులను అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ధర్మాసనం...పాఠశాలల్లో వీటిపై విద్యార్థులకు ఎలా అవగాహన కల్పిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను విద్యార్థులు అలవర్చుకునేలా చేయటానికి రూపొందించే పాఠ్యప్రణాళికలను, నిర్వహించే వర్క్‌షాప్‌ల తరహా కార్యక్రమాలేమిటో తెలియజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

# రెండు వాణిజ్య నౌకలు ఢీ.. గుజరాత్ తీరంలో ఘటన



**గుజరాత్ తీరంలో రెండు వాణిజ్య నౌకలు ఢీకొన్నాయి. కాండ్లా నౌకాశ్రయానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన భారత కోస్ట్ గార్డ్.. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. ఓ నౌకలో 24 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 21 మందిని సురక్షితంగా తరలించినట్లు వెల్లడించింది. నౌక కార్యకలాపాలు కొనసాగించేందుకు ముగ్గురు సిబ్బంది అందులోనే ఉన్నారని తెలిపింది.**

**ఎంవీ కేమ్యాక్స్ ఎంపరర్, ఎంపీ ట్రూ మారినర్ అనే వాణిజ్య నౌకలు ఢీకొన్నాయని పేర్కొంది. ఈ ఘటన నేపథ్యంలో కాలుష్య ప్రతిస్పందన చర్యలు మొదలుపెట్టామని.. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.**

# పాలకులకు అద్భుత సందేశం!

**- పుతిన్‌కు ప్రధాని మోదీ బహూకరించిన తమిళ గ్రంథం ప్రత్యేకత ఇదీ!**




బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు భారత ప్రధాని మోదీ బహూకరించిన ప్రాచీన తమిళ గ్రంథం 'తిరుక్కురళ్' ఎన్నో అద్భుత విశేషాల సమాహారం. గొప్ప తత్వవేత్త అయిన తిరువళ్లువర్ కాలాతీతమైన, శాశ్వతమైన జ్ఞానాన్ని దాదాపు 2500 ఏళ్ల క్రితమే తన రచన ద్వారా ప్రపంచానికి అందించారు. ఇందులో నైతికత, ప్రేమ, మంచితనం, సుపరిపాలన, సంపద, మనిషి ప్రవర్తన వంటి అనేక అంశాలతో కూడిన 1330 ద్విపదలు ఉన్నాయి. దీన్ని మొత్తం 133 అధ్యాయాలుగా విభజించగా, ఒక్కోదాంట్లో పది ద్విపదలు ఉన్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలి? ఇతరులతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలు మొదలు... జీవితం, మరణం, వాటిమధ్య ఇమిడి ఉన్న అనేక విషయాలను ఇందులో ప్రస్తావించారు. మానవ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలున్నాయి. పాలకులు, న్యాయం, వ్యవసాయం, పన్నులు, ప్రభుత్వాల గురించి పేర్కొన్నారు. అర్థమంతమైన, నైతిక జీవితాన్ని గడపడానికి ఈ గ్రంథాన్ని మార్గదర్శిగా భావిస్తున్నందు వల్లే ఇది తమిళనాడు సరిహద్దులు దాటి ఎన్నో ప్రపంచ భాషల్లోకి అనువాదమైంది.

# మా బడిని వెదికిపెట్టండి



బిహార్‌లోని జిల్లా కేంద్రం కటిహార్‌కు పెద్దఎత్తున చేరుకున్న ఆ గ్రామస్థులు ''సార్! మా స్కూలు మాయమైంది.. ప్లీజ్ వెదికిపెట్టరూ'' అంటూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రాణ్‌పుర్ తాలూకా దీఘాపార్ గ్రామం నుంచి వీరంతా డప్పు చప్పుళ్లతో తరలివచ్చారు. ఈ గ్రామ పాఠశాల శిథిలావస్థలో ఉండగా, కొత్త భవనం నిర్మాణానికి రూ.44.85 లక్షలు మంజూరయ్యాయి. రికార్డుల ప్రకారం టెండరు ప్రక్రియ 2024లోనే పూర్తయింది. భవన నిర్మాణపనులు కూడా పూర్తికాగా, మూడు విడతల్లో నిధులు చెల్లించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. వాస్తవానికి అక్కడ భవనం కాదు కదా.. ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. అంతా కాగితాల్లోనే కట్టేసి, నిధులు స్వాహా చేశారంటూ గ్రామస్థులు ఈ వినూత్న నిరసనకు దిగారు.స్వయంగా పరిశీలించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని కటిహార్ సబ్ డివిజనల్ అధికారి సూరజ్‌కుమార్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

# కట్ల పామునే.. కట్లు లేవంతే..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరి (దుధ్వా టైగర్ రిజర్వ్) ప్రాంతంలో అరుదైన కట్లపాము కనిపించింది. సాధారణంగా కట్లపాములు మెరుస్తూ, తేలిక రంగు అడ్డ చారలతో ఉంటాయి. దీనిపై మాత్రం ఎలాంటి చారలూ లేవు. రంగు కూడా వెలిసిపోయింది. ఇది అసాధారణమైనదని పశుసంవర్ధక శాస్త్ర నిపుణుడు డాక్టర్ దయా శంకర్ తెలిపారు. దీని జన్యుపరమైన అంశాలను అధ్యయనం చేస్తామని వన్యప్రాణి అధికారులు తెలిపారు.



# స్థానిక ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరేద్దాం: కేతిరెడ్డి

- ప్రతి గ్రామం.. ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండాలి.....
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.....

**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం ధర్మవరంలోని తన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కేతిరెడ్డి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల సన్నద్ధత, గ్రామాలు, వార్డుల్లో పార్టీ బలోపేతం తదితర అంశాలపై శ్రేణులతో చర్చించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని కేతిరెడ్డి సూచించారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం




కృషి చేయాలని అన్నారు. పార్టీ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని కేతిరెడ్డి సూచించారు. ఎన్నికల సమరానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# అడిగితే ఆలస్యం లేదు.. ఆపన్నహస్తానికి వెనుకడుగు లేదు

- వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ డీకే బాబు
- తలుపులలో డీకే బాబు దాతృత్వం.. వినాయక చవితికి రూ.5.10 లక్షల భారీ విరాళం!

**తలుపుల సెప్టెంబర్12 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని వినాయక చవితి సందర్భంగా గణనాధుని విగ్రహాల కొరకు కమిటీ సభ్యులకు అడగగా రూ. 5,10,000/ ఐదు లక్షల 10 వేల రూపాయల విరాళంను వైఎస్ఆర్సిపి తలుపుల మండల కన్వీనర్ డికె బాబు అందజేశారు.
ఈ సందర్భంగా డీకే బాబు మాట్లాడుతూ తలుపుల మండలంలో ఏ సమస్య వచ్చినా 24 గంటల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరియు అందుబాటులో లేకపోయినా తన అనుచరులు ఉంటారని తెలియజేశారు..



అనంతరం తలుపుల మండలం కేంద్రంలోని ప్రజలు మరియు నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతి ఒక్కరూ మేము ఎల్లప్పుడూ డీకే బాబుకి అండగా ఉంటామని తెలియజేశారు. మరియు డీకే బాబు వెంటే ఉంటామని కొనియాడారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా ఎమ్మెల్యే కాలవ.



**రాయదుర్గం, సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

సీఎం ఆర్ ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసాని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్సలు, ఖరీదైన వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. 34 మంది లబ్ధిదారులకు రూ.16.48 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 565 మందికి రూ.3.50 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. పలువురు పేదలు వైద్య ఖర్చుల కోసం అప్పులు చేసి కర్ణాటక తదితర ప్రాంతాలకు వెళ్లి మెరుగైన వైద్యం పొందుతున్నారని, అలాంటి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు.సహాయం పొందిన కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాయదుర్గం నియోజకవర్గంలోని మరింత మంది పేదలకు పెద్ద ఎత్తున వైద్య సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు వన్నారెడ్డి, మోహన్ రెడ్డి, మల్లెన్న, క్లస్టర్ ఇంచార్జి తలారి గంగాధర్, సుదర్శన్,గోపాల్ రెడ్డి, బుదూరు తిప్పే స్వామి,ధనార్జున తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం





- పొంగూరు షరణి
- రూపాయికే విలాసవంతమైన ఫంక్షన్ హాల్
- మంత్రి నారాయణ ప్రజా నిబద్ధత నిదర్శనం
- 1.40 కోట్లతో రేబాల పార్కు అభివృద్ధి – పర్యటించి హర్షం వ్యక్తం చేసిన పొంగూరు షరణి
- ఈ నెల 16న నెల్లూరుకు మంత్రి నారా లోకేష్..
- ఆర్ ఎస్ ఆర్ , డిఎస్ఆర్ మోడల్ స్కూల్స్ పరిశీలించిన పొంగూరు షరణి

**నెల్లూరు సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్**

మా నాన్న మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎన్నికల ప్రచారంలో 8వ డివిజన్‌లో పర్యటించినప్పుడు పండు అనే చిన్నారి కోరిన హామీని నెరవేర్చి, ఆ బాలుడి చేతుల మీదుగానే పార్కును ప్రారంభించడం ఆయన నైతికతకు, ప్రజా నిబద్ధతకు నిదర్శనమని మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి తెలిపారు. NCAP 25 లక్షలు, కార్పొరేషన్ 1.15 కోట్లు నిధులతో మొత్తం 1.40 కోట్ల అంచనాతో నిర్మించిన ఈ ప్రాజెక్టులో అధునాతన AC జిమ్, కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వచ్చాయని, పేదలకు ప్రైవేట్ హాల్స్ భారం కాకూడదనే ఏకైక ఉద్దేశంతో సెంట్రల్ AC, 500 మంది కెపాసిటీ, విశాలమైన పార్కింగ్ ఉన్న హాల్‌ను కేవలం రూపాయికే అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 16న ఐటీ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌తో కలిసి స్టోన్ హౌస్ పేటలోని RSR, మూలాపేటలోని DSR పాఠశాలల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం రేబాల పార్కును పర్యటించిన షరణి, అక్కడ ఉన్న వాతావరణం, జిమ్ ఎక్విప్‌మెంట్ చాలా బాగుందని, ఎంతో ఆహ్లాదకరంగా ఉందని తీవ్ర సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ నాన్నగారు ఇచ్చే ప్రతి మాటనూ ఖచ్చితంగా పాటిస్తూ నెల్లూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతారని స్పష్టం చేశారు. ఇప్పటికే నగరంలో 35 పార్కులను అందుబాటులోకి తెచ్చామని, త్వరలోనే వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ పార్కులను కూడా ప్రారంభించబోతున్నామని వెల్లడించగా, అక్కడ తనతో సరదాగా గడిపిన పిల్లలు థాంక్యూ నారాయణ సార్, థాంక్యూ షరణి అంటూ ఎంతో ఆనందంతో కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి తిరుమల నాయుడు,కో క్లస్టర్ హేమంత్,వైస్ ప్రెసిడెంట్ శేఖర్,మల్లి, అజయ్,సుబ్బారావు..తదితరులు పాల్గొన్నారు

# మట్టి వినాయకునే పూజిద్దాం

-పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి,సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**



వినాయక చతుర్థి సందర్భంగా మట్టి వినాయకుడిని పూజించాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.గురువారం చిన్నంపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన వినాయక చతుర్థి సందర్భంగా మట్టి విగ్రహాల తయారీ,చిట్టి చేతుల్లో మట్టి గణపతి కార్యక్రమంలో చిన్నారులు చేసిన మట్టి బొమ్మలకు బహుమతి ప్రదానం చెసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. వినాయక చవితి పండుగను సుస్థిరంగా మరియు పర్యావరణానికి అనుకూలంగా జరుపుకోవాలని, చెరువులు మరియు జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిద్దాం లేదా పూర్తిగా మానేయాలన్నారు. మట్టితో చేసిన ప్రతిమలను వాడాలని, విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నారా వంటి పదార్థాలను వినియోగించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వాడకం నిషేధించబడిందని మరియు పిఓపిలో హానికరమైన రసాయనాలు నీటి కాలుష్యానికి దారితీస్తాయని మరియు నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి పర్యావరణ అనుకూలమైన (క్లే) గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా విగ్రహాల తయారీ, నిమజ్జన కార్యక్రమం జరగాలని సూచించారు. వినాయక మండపాలకు అనుమతులు జారీ చేసేటప్పుడు మరియు విగ్రహాల ఏర్పాటు సమయంలో కూడా రెవెన్యూ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ డిపార్ట్‌మెంట్, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ మరియు పోలీసు డిపార్ట్‌మెంట్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన సవరించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ ఇంజనీర్, శ్రీమతి శశికళ,డిఆర్‌డిఎ పిడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్‌కు డ్రాగన్ 11, పెనుకొండ జట్లు



**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న అటల్ జనహిత వాజపేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్-సీజన్-3 ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. టోర్నమెంట్‌లో భాగంగా శనివారం నిర్వహించిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రత్యర్థులపై విజయం సాధించిన డ్రాగన్ 11, పెనుకొండ జట్లు తుది పోరుకు అర్హత సాధించాయి. ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు టాస్ వేసి సెమీఫైనల్ పోటీలను ప్రారంభించారు. తొలి సెమీఫైనల్‌లో డ్రాగన్ 11-తారక్ 11 జట్లు తలపడగా డ్రాగన్ 11 జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన రెండో సెమీఫైనల్‌లో పెనుకొండ-హిందూపురం జట్లు తలపడగా పెనుకొండ జట్టు ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో డ్రాగన్ 11, పెనుకొండ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 16న జరిగే తుది పోరులో ఈ రెండు జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. దీంతో ఫైనల్ మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్థానిక క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడలకు ప్రోత్సాహం అందిస్తూ యువతకు మంచి వేదిక కల్పించడమే లక్ష్యంగా పోటీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి 100% విజయమే లక్ష్యం



- కూటమి పార్టీల మధ్య సమన్వయం.. ప్రతి స్థానంలో విజయమే ధ్యేయం

**ధర్మవరం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్ :**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలో విజయం సాధించడమే లక్ష్యంగా కర్నూలు పార్లమెంట్ పరిధిలో కూటమి నేతలు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్నూలు పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు సంబంధించిన పలు కీలక అంశాల పై కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త చిలకం మధు సుధన్ రెడ్డి ఈరోజు ఎన్ డి ఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం, కూటమి అభ్యర్థులు ఎక్కడెక్కడ పోటీ చేయాలనే అంశాలపై చర్చించారు. ఏ పార్టీ అభ్యర్థి పోటీ చేసినా.. మిగిలిన కూటమి భాగస్వామ్య పార్టీలు సమష్టిగా అండగా నిలిచి, ఆయా స్థానాల్లో విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు. పోటీ చేసే స్థానాల సంఖ్య కాదు.. గెలిచే స్థానాలే ముఖ్యం అన్న లక్ష్యంతో ప్రతి వార్డు, ప్రతి స్థానాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నాయకులు చర్చించారు. కూటమి నేతల మధ్య సమన్వయం, కార్యకర్తల మధ్య ఐక్యత, పటిష్టమైన ఎన్నికల వ్యూహంతో ఎన్ డి ఏ కూటమికి 100% స్ట్రైక్ రేట్ సాధించేలా ముందుకు సాగాలని నిర్ణయించారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 409 కేసులు పరిష్కారం..



- జడ్జీలు వెంకటేశ్వర్లు, వెంకట హరీష్.

**ధర్మవరం సెప్టెంబర్ 12, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలతో 409 కేసులు పరిష్కారం కావడం జరిగిందని సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వెంకట హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాజి మార్గమే రాజమార్గమని, రాజీకు కాబడిన కేసులు మాత్రమే పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇంతటి విజయానికి కృషిచేసిన పోలీస్ శాఖకు, న్యాయవాదులకు, బార్ అసోసియేషన్ వారికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. పరిష్కారమైన కేసులలో ఓఎస్ కేసులు నాలుగు (రూ.6,02,800), ఈ పీ కేసులు ఒకటి (రూ.4,500), ఎం సి కేసులు ఒకటి (నాలుగు లక్షల రూపాయలు), సీసీఐపీసీ కేసులు 40, సీసీ ఎక్సైజ్ కేసులు 93 (రూ.3,32,144), ఎస్ టి సి కేసులో రెండు (రూ.11,33,000), ఎస్టిసి కేసులు 265 ఇందులో జరిమానా నగదు రూ,1,25,060, సీజుడు అమౌంటు రూ.6,11,800, బ్యాంకు పి ఎల్ సి కేసులు మూడు (రు.1,36,000), తెలిపారు409 కేసులు(రూ.27,74,004) పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోటి సిబ్బంది పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | రంగారెడ్డి
13.09.2026



# కార్మికుడి ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు

**- సింగరేణి భద్రతా ప్రమాణాలపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ గట్టి హెచ్చరిక**

**రామగుండం సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి 11 ఇంక్లైన్ ఆర్జీ 1 పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడి మోకాలికి గాయం కావడంతో ఆరు కుట్లు పడిన ఘటనను ప్రస్తావించిన ఆయన.. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.చిన్న ప్రమాదంగా భావించి నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. "ఈరోజు ఆ కార్మికుడు ఆరు కుట్లతో బయటపడ్డాడు. రేపు అదే పరిస్థితి ప్రాణాపాయంగా మారకూడదు. కార్మికుడి ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదు" అని ఎంపీ స్పష్టం చేశారు.కూలిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, ప్రాణాపాయం ఉన్న భూగర్భ ప్రాంతాల్లో భద్రతా చర్యలను అత్యంత కఠినంగా అమలు చేయాలని కోరారు. అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి పెంపునకు మాత్రమే కాకుండా కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యంగా వినియోగించాలని సూచించారు. ఇటీవల బెల్లంపల్లిలో జరిగిన ప్రమాదాన్ని కూడా ప్రస్తావిస్తూ వరుస ప్రమాదాల నివారణకు సింగరేణి భద్రతా వ్యవస్థపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**ఉత్తర తెలంగాణకు మెరుగైన రైలు కనెక్టివిటీ కల్పించాలి**

ఉత్తర తెలంగాణ ప్రజలకు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో మెరుగైన రైలు అనుసంధానం కల్పించాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ మధ్య అదనపు రైళ్ల కోసం తాను



పలుమార్లు విజ్ఞప్తి చేశానని తెలిపారు.పార్లమెంట్ సమావేశాల సమయంలో రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను కలిసి ఈ ప్రాంత ప్రజల అవసరాలను వివరించినట్లు చెప్పారు. ఉత్తర తెలంగాణ నుంచి రైల్వేకు భారీగా సరుకు రవాణా ఆదాయం వస్తున్నప్పటికీ, అదే స్థాయిలో ప్రయాణికుల రైలు సౌకర్యాలు లేకపోవడం అన్యాయమన్నారు.రైల్వేకు ఆదాయం అందించే ప్రాంతానికి తగిన రైలు కనెక్టివిటీ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. ఆదాయం వచ్చే ప్రాంతాలు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే బోర్డు అవసరాల ఆధారంగా అధ్యయనం చేయాలని కోరారు.ఇటీవల నిర్వహించిన పరీక్షా ప్రయాణాన్ని, పండుగల సందర్భంగా ప్రకటించిన ప్రత్యేక రైళ్లను స్వాగతించిన ఎంపీ.. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్‌కు శాశ్వతంగా మెరుగైన రైలు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖను కోరారు.

**అంబేద్కర్ భవనానికి వెంటనే స్థలం కేటాయించాలి**

అంబేద్కర్ భవన నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి సుమారు రూ.50 లక్షలు ఇప్పటికే కేటాయించినట్లు ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కలెక్టర్ స్థాయి నుంచి సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినప్పటికీ జాప్యం జరుగుతోందన్నారు."నిధులు ఇప్పటికే కేటాయించాను. కలెక్టర్ కూడా అనుసరిస్తున్నారు. ఇక సింగరేణి యాజమాన్యం ఆలస్యం చేయకుండా వెంటనే స్థలం కేటాయించి అంబేద్కర్ భవన నిర్మాణానికి మార్గం సుగమం చేయాలి" అని ఎంపీ స్పష్టం చేశారు.కార్మికుల భద్రత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవడం, ఉత్తర తెలంగాణకు మెరుగైన రైలు కనెక్టివిటీ కల్పించడం, అంబేద్కర్ భవనానికి తక్షణమే స్థలం కేటాయించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు.

# మట్టి గణపతులనే ప్రతిష్ఠించండి




**– పర్యావరణ పరిరక్షణతో వినాయక చవితి జరుపుకోవాలి:**

**నల్లకుంట ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:అనంత జనశక్తి న్యూస్**

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని నల్లకుంట ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు.నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ (NCA), హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (HCF) ఆధ్వర్యంలో నల్లకుంటలో నిర్వహించిన మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. వినాయక చవితి వేడుకలను భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కార్యక్రమంలో ఎంసీఏ అధ్యక్షులు వి. మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మోహన్ నాయుడు, పి. శ్రీనివాసరావు, హెచ్ సి ఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య, రామకృష్ణారావు, రాజీవ్ కుమార్, డాక్టర్ అమర్‌నాథ్, సత్యనారాయణ, కృష్ణబాబు, కిరణ్, గోపాల్, శివకుమార్, వినోద్, సుకుమార్, నరసింహమూర్తి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**



గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాప్తాడు మండలంలోని అయ్యవారిపల్లి క్రాస్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రాప్తాడు పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన కోనేపల్లి ఆదినారాయణరెడ్డి (61) బస్సులకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ తీసుకురావడానికి శనివారం ఉదయం తన హోండా షైన్ మోటార్‌సైకిల్‌పై రాప్తాడు ఆటోనగర్‌కు వచ్చారు. స్పేర్ పార్ట్స్ తీసుకున్న అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో అయ్యవారిపల్లి క్రాస్ సమీపంలోని ఎన్‌హెచ్ 44పై అనంతపురం వైపు వెళ్తుండగా.. బెంగళూరు వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణరెడ్డికి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రాప్తాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు రాప్తాడు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

# నందనవనం పట్ల నిర్లక్ష్యం ఎందుకు?

**- సోషల్ జస్టిస్ పార్టీ**
**- ఇంకా తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ సమస్యలా..?**
**- సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు**

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

ఎల్బీనగర్ నియోజకవర్గం లోని నందనవనం కాలనీ ఏర్పాటు చేసి దశాబ్దాలుగా కావస్తున్నా ఇంకా తాగునీరు సమస్య మరియు డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు వాటి సమస్యలు కొనసాగుతుండడం దారుణమని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు ఆవేదన వ్యక్తం చేశారు. నందనవనం కాలనీ సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వము కనీస వసతులు కల్పనలో కూడా విఫలమయ్యాయని ఆరోపించారు. శనివారం




నాడు సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ నందనవనం కాలనీలో బస్తీ దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రజలు పార్టీ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికులు పలు సమస్యలు వివరిస్తూ తక్కువగా తాగునీరు సరఫరా చేస్తున్నారని, తక్కువ ప్రెజర్ తో వస్తున్నాయని నీళ్లు సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరు వచ్చిన ప్రతి ప్రతిసారి డ్రైనేజీ నీరు మంచినీరు కలిసి వస్తున్నాయని, రోడ్లపై మురుగునీరు పారుతుండడంతో మనుషులు నడవలేని పరిస్థితి వచ్చిందని వారు చెప్పారు. వారి సమస్యలు విన్న సోషల్ జస్టిస్ పార్టీ నేతలు సంబంధిత అధికారులు కు తాగునీటి డ్రైనేజీ సమస్యలపై వినతి పత్రం అందించి పరిష్కరించేంత వరకు పోరాడుతామని చెప్పారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండకు వర్షాలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న కారణంగా తక్షణమే బస్ షెల్టర్ నిర్మించాలని పార్టీ నాయకులకు వివరించారు. వీధి వ్యాపారులందరికి లైసెన్స్ ఇప్పించాలని అందుకు మున్సిపల్ అధికారులకు లేఖలు రాస్తామని సందర్భంగా పార్టీ నేతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి కెవి గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, సంయుక్త కార్యదర్శి సతీష్ మహాజన్, దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు సైదులు యాదవ్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు వడ్డెర రఘుపతి తదితరులు పాల్గొన్నారు

# హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు స్పాట్



**- రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టింది**
**- ప్రాణాలతో బయటపడిన కుమార్తె పండుగ పూట విషాదం.**

**అగళి సెప్టెంబర్ 12,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలకేంద్రం నందు 544E నెం. గల హైవే పై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దొడ్డరంగప్ప అను వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు గుడిబండ మండలం సింగేపల్లి పంచాయితికి చెందిన దొడ్డరంగప్ప అను వ్యక్తి, అగళి మండలకేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న తన కుమార్తె మోనికను పండుగకు పిలుచుకొని ఊరికి వెళ్ళుతుండగా అగళి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 544E నెం. గల రహదారి పై ద్విచక్రవాహనం ద్వారా దొడ్డరంగప్ప రోడ్డు దాటుతుండగా రొళ్ళ వైపు నుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఢీకొట్టగానే కుమార్తె కిందకు పడి ప్రాణాలతో బయట పడింది. దొడ్డరంగప్ప మాత్రం నుజ్జు నుజ్జయ్యాడు, టిప్పర్ లారీ కొద్ది దూరం మేర వరకు బైక్ ను, దొడ్డరంగప్పను ఈడ్చుకెళ్ళింది. దొడ్డ రంగప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్సై రంగడు యాదవ్ ప్రమాద స్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదే




**- యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు గుండా మల్లయ్య గుప్తా.**

**కొత్తపేట్ సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

సమాజంలో తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదేననీ యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులు గుండా మల్లయ్య గుప్తా పేర్కొన్నారు. శనివారం కొత్తపేట వాసవి కాలనీ లోని హోటల్ శ్రీవేద ఫంక్షన్ హాల్ లో వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డా కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో గురుపూజోత్సము కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లయ్య గుప్తా మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దేశ నిర్మాణం తరగతి గదిలోనే తీర్చిదిద్దుకుంటుందని అన్నారు. ఏ వృత్తిలో ఉన్న అంత సంతృప్తి ఇవ్వదని, ఒక్క ఉపాధ్యాయ వృత్తిలోనే సంతృప్తి ఉంటుందని అన్నారు. అనంతరం ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వైశ్య వికాస వేదిక నుండి ప్రతి సంవత్సరము గురుపూజోత్సవాన్ని నిర్వహించి రాష్ట్రంలోని వైశ్య ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. గత 8 సంవత్సరాలుగా దాదాపు 3,000 మంది ఉపాధ్యాయులను సన్మానించి వారిని గౌరవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణవ గ్రూప్ సి ఎం డి బూరుగు రవి గుప్త, సంఘ సేవకులు గౌరీశెట్టి శ్రీనివాస్, ఎం వి ఎస్ ఆర్ కాలేజ్ వ్యవస్థాపక డైరెక్టర్ వెంకటేశం గుప్తా, నీల శ్రీధర్ ,
వైశ్య వికాస వేదిక ప్రధాన కార్యదర్శి నంగునూరు రమేష్, కొత్త రవి, కాచం నరసింహులు, కాచం ఎక్ సాయి, కూర రమేష్ , రామ్ నరేష్, కోడుమూరి దయాకర్, కాచం సుష్మ , రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైసీపీకి షాక్.. టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసిపి నాయకులు

**- అగళి మండలం హల్లికేరా గ్రామంలో టీడీపీలోకి భారీ చేరికలు**

**అగళి సెప్టెంబర్ 12,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలం హల్లికేరా గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ ద్యావమ్మతో పాటు సుమారు 100 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ పాలన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని ఆయన అన్నారు. గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# అనంత కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి**
**- సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ డిమాండ్**

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లాను కరువు కమ్మేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ మండిపడ్డారు. అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కరువు పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు రాప్తాడు మండలం గంగులకుంటలో రామకృష్ణ పర్యటించారు. కరువు కారణంగా ఎండిపోయిన చీని తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వేరుశెనగ, కంది పంటలు కూడా దాదాపుగా పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



ఏళ్ల తరబడి సంరక్షించిన తర్వాతే దిగుబడికి వచ్చే పండ్ల తోటలు సైతం కళ్లముందే ఎండిపోతుండటం ఆవేదన కలిగిస్తోందని రామకృష్ణ అన్నారు. పరిస్థితులు ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కోవడం రాష్ట్ర ప్రభుత్వ ఒక్కదాని బాధ్యత కాదని, కేంద్ర ప్రభుత్వం కూడా సమాన బాధ్యత తీసుకుని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు కరువు పరిస్థితులపై స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ సమీక్ష సమావేశంలో కూడా కరువు అంశం ఎజెండాలో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని రామకృష్ణ విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మరో మూడు రోజుల పాటు పర్యటించి క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలిస్తామని రామకృష్ణ తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 15 లేదా 16 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించేందుకు సీపీఐ, రైతు సంఘం సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు పి. జగదీష్, జిల్లా కార్యదర్శి పాలెం నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల

**- పోషణ్ మాసం–2026లో భాగంగా అవగాహన కార్యక్రమం**

**రాప్తాడు సెప్టెంబర్ 12 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలం ఎర్రగుంట గ్రామంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాసం-2026లో భాగంగా 'మన అంగన్వాడి-మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ శ్రీమతి ఉమాశంకరమ్మ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వారి బరువు, ఎత్తును క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన అవసరాన్ని వివరించారు.

ఆరు నెలలు పూర్తయిన చిన్నారులకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని మెత్తగా ఉడికించి గుజ్జు రూపంలో పిల్లలకు అందించడం ద్వారా వారి శారీరక ఎదుగుదలకు, ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలామృతం, బాలసంజీవని కిట్లు, బియ్యం, కందిపప్పు, నూనె తదితర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఉపయోగపడేలా లబ్ధిదారులే వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, బాల్యవివాహాలు లేదా చిన్నారుల రక్షణకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర సేవల కోసం 100కు సమాచారం అందించాలని తెలిపారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్త చంద్రకళ, హెల్పర్ సరోజతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఆదివారం | రంగారెడ్డి
13.09.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
07



# మూసుకుపోయిన ముక్కును ఒక్క నిమిషంలో ఎలా క్లియర్ చేయాలో చెప్పిన ఎక్స్‌పర్ట్, చాలా సింపుల్ టెక్నిక్

శీతాకాలం ప్రారంభమైంది. మారుతున్న వాతావరణం కారణంగా జలుబు, దగ్గు రావడం సర్వసాధారణం. ఇక, జలుబు చాలా మందికి ఇబ్బంది కలిగిస్తుంది. జలుబు కారణంగా ముక్కు మూసుకుపోతుంది. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మొదలవుతుంది. దీని కారణంగా రోజంతా ఇబ్బంది పడాల్సి వస్తుంది. వాస్తవానికి జలుబు సమయంలో ముక్కు లోపలి ఉండే పొర ఉబ్బుతుంది. దీని కారణంగా ముక్కు ద్వారా వెళ్లే గాలి మార్గం వాపు కారణంగా ఇరుకుగా మారుతుంది. అంతేకాకుండా జలుబులో ఉత్పత్తి అయ్యే శ్లేష్మం పెరుగుతుంది. దీంతో, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. మీ ముక్కు కూడా మూసుకుపోయి ఇబ్బంది పడుతుంటే.. ఓ టెక్నిక్ సాయపడుతుంది. ఆక్యుప్రెషర్ టెక్నిక్ గురించి యోగిక్ సోల్ పేజీలో ఎక్స్‌పర్ట్స్ రంజనా షేర్ చేశారు. ఆమె చెప్పినట్టు టెక్నిక్ ఫాలో అయితే మూసుకుపోయిన ముక్క నిమిషాల్లో క్లియర్ అవుతుంది. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం.



### ఎక్స్‌పర్ట్ చెప్పిన చిట్కా

యోగా నిపుణురాలు రంజనా కుమై తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఈ టెక్నిక్ షేర్ చేశారు. ఈ ట్రిక్ చాలా సింపుల్. మీ ముక్కు రంధ్రం కుడివైపు మూసుకుపోతే.. ఆ చేతి పిడికిలిని.. ఎడమ చేతి చంక కింద ఉంచి నొక్కాలని ఎక్స్‌పర్ట్ చెబుతున్నారు. అదే మీ ముక్క రంధ్రం ఎడమవైపు మూసుకుపోతే.. ఆ చేతి పిడికిలిని.. కుడి చేతి చంక కింద ఉంచి నొక్కాలని వీడియోలో చెప్పారు. ఇలా చేసిన తర్వాత.. ఆ పొజిషన్‌లో కొద్దిసేపు ఉండి లోతుగా గాలి పీల్చుకోవాలని చెప్పారు. ఆ తర్వాత గాలి వదలాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల ముక్క క్లియర్ అవుతుందని ఆమె చెప్పారు.

### ఆక్యుప్రెషర్ పాయింట్స్

జలుబు సమయంలో శ్లేష్మం కారణంగా ముక్కు మూసుకుపోతుంది. దీన్ని ఎదుర్కోవడానికి ఈ ఆక్యుప్రెషర్ పాయింట్లను నొక్కడం ఉపశమనం కలిగిస్తుంది. రెండు నాసికా రంధ్రాల మూలలకు మీ వేళ్లతో సున్నితంగా





ఒత్తిడి చేయడం వల్ల మూసుకుపోయిన ముక్కు తెరవబడుతుంది. అదేవిధంగా, రాత్రి నిద్రపోతున్నప్పుడు ముక్కు మూసుకుపోయి ఉంటే, మీ కనుబొమ్మల మధ్య ఉన్న బిందువును నొక్కడం వల్ల నాసికా శ్వాస సులభతరం అవుతుంది. వీటితో పాటు కొన్ని ఇతర చిట్కాలు కూడా మూసుకుపోయిన ముక్కును క్లియర్ చేయడంలో హెల్ప్ చేస్తాయి.

### ఆవిరి పట్టడం

మూసుకుపోయిన ముక్కును క్లియర్ చేసుకోవడానికి ఆవిరిని ఉపయోగించవచ్చు. సాధారణంగా మార్కెట్‌లో దొరికే స్టీమర్ ద్వారా ఆవిరి పట్టుకోవచ్చు. మీ దగ్గర స్టీమర్ లేకపోతే, ఒక పాత్రలో వేడి నీటిని పోసి దానిపై వంగి, మీ తలను టవల్‌తో కప్పకోండి. ఆ తర్వాత ఆవిరి పీల్చుకోవడానికి ట్రై చేయండి. ఈ టెక్నిక్ మూసుకుపోయిన ముక్కును క్లియర్ చేయడానికి సహాయపడుతుంది. దాని ప్రభావాన్ని పెంచడానికి ఆ వేడి నీటిలో తులసి ఆకుల్ని కూడా జోడించవచ్చు.

### హెర్బల్ టీ తాగండి

అల్లం, పసుపు, లవంగాలు లేదా తులసి కలిపిన హెర్బల్ టీ తాగడం వల్ల కూడా ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది ముక్కు లోపలి మార్గాల్ని క్లియర్ చేస్తుంది. అంతేకాకుండా శ్వాస సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేడి హెర్బల్ టీని రోజుకు 2 నుంచి 3 సార్లు తాగవచ్చు.

### హాట్ కంప్రెస్

గోరువెచ్చని నీటిలో గుడ్డను ముంచి.. దాన్ని బయటకు తీసి ముక్కుకు అప్లై చేయాలి. దీని వల్ల కూడా మూసుకుపోయిన ముక్కు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ టెక్నిక్ ముక్కు చుట్టూ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ముక్కు దిబ్బడ వల్ల ఆ ప్రాంతంలో ఎరుపు లేదా మంట అనిపిస్తుంది. అలాంటప్పుడు హాట్ కంప్రెస్ మంటను తగ్గించడంలో సాయపడతాయి.

# పిల్లల్లో జ్వరంతో పాటు కొన్ని లక్షణాలు కనపడితే అస్సలు నిర్లక్ష్యం చేయకండి





క్యాన్సర్ మహమ్మారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి చాలా మందిని ప్రభావితం చేస్తుంది. ఈ వ్యాధి కొన్ని సార్లు ప్రాణాంతకం కావచ్చు. ఇది పెద్దలతో పాటు పిల్లల్ని కూడా ప్రభావితం చేయగలదు. అయితే, పిల్లల్లో క్యాన్సర్ కేసులు పెద్దలు, వృద్ధుల కంటే తక్కువగా కనిపిస్తాయి. అందుకే చాలా మంది దీన్ని లైట్ తీసుకుంటారు. అయితే, దీనిపై అవగాహన చాలా ముఖ్యమని నిపుణులు అంటున్నారు. పిల్లల్లో కనిపించే కొన్ని లక్షణాలు చాలా మంది తల్లిదండ్రులు సాధారణమైనవిగా భావిస్తారు. ఇవి సాధారణమైనవి అని భావించి లైట్ తీసుకుంటే అది తీవ్రమై క్యాన్సర్ రూపంలోకి మారవచ్చు. చైల్డ్ హుడ్ క్యాన్సర్ కేర్ హాస్పిటర్ డాక్టర్ తండేకా పిల్లల్లో క్యాన్సర్ ముందస్తు లక్షణాల్ని షేర్ చేశారు. అసలు పిల్లల్లో క్యాన్సర్ ఎందుకు వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి ఇలా పూర్తి వివరాల గురించి తెలుసుకుందాం.

### పిల్లల్లో క్యాన్సర్ కారణాలు

పిల్లల్లో క్యాన్సర్ కారణాలు

భారతదేశంలో క్యాన్సర్ కేసులు ఎక్కువ నమోదవుతున్నాయి. అయితే, పిల్లల్లో క్యాన్సర్ తక్కువ శాతమే అని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే, తక్కువ సంఖ్యలో కణితుల కారణంగా క్యాన్సర్ ఇప్పటికీ గణనీయమైన ప్రభావాన్ని చూపుతందని డాక్టర్ వివరించారు. పిల్లల్లో క్యాన్సర్ సాధారణంగా జీవనశైలికి సంబంధించినవి కావని నిపుణులు చెబుతున్నారు. అవి చిన్నతనంలో సంభవించే జన్యు మార్పుల వల్ల సంభవిస్తాయి. ఒక్కోసారి తరచుగా స్పష్టమైన కారణం లేకుండా క్యాన్సర్ వస్తుందని చెప్పారు.

### పిల్లల్లో సాధారణంగా వచ్చే క్యాన్సర్ల పేర్లు

* లుకేమియా,
* మెదడు, వెన్నుపాము కణితులు
* లింఫోమా
* న్యూరోబ్లాస్టోమా
* విల్మ్స్ కణితి
* ఆస్టియో సార్కోమా
* ఎవింగ్ సార్కోమా వంటి ఎముక క్యాన్సర్లు





వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### పిల్లల్లో క్యాన్సర్ ప్రారంభ సంకేతాలు

పిల్లల్లో క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ఇప్పటికీ ఒక పెద్ద సవాలుగా ఉంది. అందువల్ల, కొన్ని లక్షణాలను ఎప్పుడూ విస్మరించకూడదు. ఈ లక్షణాలు సాధారణ పిల్లల అనారోగ్యాల వల్ల సంభవించవచ్చు, అయినప్పటికీ వాటిపై నిఘా ఉంచడం చాలా ముఖ్యం.

* నిరంతర జ్వరం
* అలసట
* ఎటువంటి కారణం లేకుండా బరువు తగ్గడం
* తరచుగా ఇన్ఫెక్షన్లు
* ఎముక నొప్పి
* ఆకస్మిక దృష్టి మార్పులు
* శరీరంలోని ఏ భాగంలోనైనా గడ్డ/వాపు

### పిల్లల్లో క్యాన్సర్ చికిత్స

* గత దశాబ్దంలో కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ప్రెసిషన్ మెడిసిన్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, మెరుగైన సర్జికల్ టెక్నిక్‌లు పిల్లల క్యాన్సర్ చికిత్సలో పురోగతికి దారితీసింది.
* తల్లిదండ్రులు, పాఠశాలలు క్యాన్సర్ గురించి అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముందస్తు హెచ్చరిక సంకేతాల్ని గుర్తించడం, సకాలంలో వైద్య సలహా తీసుకోవడం, క్యాన్సర్ గురించిన అపోహల్ని తొలగించడం క్యాన్సర్ చికిత్స గణనీయంగా మెరుగుపడుతుంది.

### పిల్లల్లో క్యాన్సర్ సంకేతాల్ని గుర్తించడానికి సాయపడే పరీక్షలు

* CBC (పూర్తి రక్త గణన)
* ఇమేజింగ్ పరీక్షలు (ఛాతీ ఎక్స్-రే మరియు అల్ట్రాసౌండ్)
* మూత్ర పరీక్ష
* జన్యు పరీక్ష
* శారీరక పరీక్ష



# తిరగబడ్డ జాతి కథ... ది ప్యారడైజ్



"ఈ 18 ఏళ్లలో మానసికంగా, శారీరకంగా నేను ఎక్కువగా కష్టపడింది 'ది ప్యారడైజ్' కోసమే. ప్రచార చిత్రాల్లో హింస కనిపిస్తుందేమో కానీ, మేం దాని వెనకున్న భావోద్వేగాల్ని ప్రేక్షకులు అనుభూతి చెందాలని చేసిన ప్రయత్నమే ఈ చిత్రం" అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు ముఖ్యభూమిక పోషించారు. ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. నాని మాట్లాడుతూ... "ఒక సినిమాకి ఇంత విరామం నా కెరీర్‌లో ఎప్పుడూ రాలేదు. కొన్ని అనివార్య కారణాలు, మా ప్రణాళికల్లో లోపాలు ఇందుకు కారణం కావొచ్చు. ఇదంతా మాకు ఓ అనుభవ పాఠంలా ఉపయోగపడుతుంది. అయితే మేం ఏం అనుకుని ఈ సినిమాని మొదలుపెట్టామో, దాన్ని పక్కాగా సిద్ధం చేయడంలో మాత్రం విజయవంతం అయ్యాం. ఇప్పటికే పలు బృందాలు నిద్రాహారాలు మానేసి పనిచేస్తున్నాయి. ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాలకూ, పాటలకు ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన లభించింది. వాటిని సొంతం చేసుకున్న తీరు చూశాక మాపై బాధ్యత ఇంకా పెరిగిపోయింది. ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని పంచడం కోసం సినిమాని నాణ్యతతో సిద్ధం చేస్తున్నాం. విడుదల తేదీ దగ్గర పడుతున్న దృష్ట్యా, సినిమాని నాణ్యగా ముస్తాబు చేయడం కోసం ట్రైలర్‌ని విడుదల చేయడం లేదు. ఈ సినిమా ప్రయాణంలో జడలతో పోరాట ఘట్టాల్లో నటించడమే తాను ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్. జడలు, చేతిపై పచ్చబొట్టు... ఇలా ప్రత్యేకమైన వేషధారణతో నా పాత్ర కనిపిస్తుంది. మొండి ఘటమైన దర్శకుడు శ్రీకాంత్ నిజాయతీతో కూడిన ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే ఆ రూపం. ఈ సినిమా ప్రయాణంతో మోహన్‌బాబులోని మరో కొత్త మనిషిని చూశా. ఆయనతో కలిసి పనిచేస్తే ప్రేమలో పడతారు. నేను ఇప్పటివరకూ చేసిన సినిమాల్ని చూస్తే నేను ట్రెండ్‌ను అనుసరించలేదనే విషయం స్పష్టం అవుతుంది. 'హిట్ 3', 'ది ప్యారడైజ్', 'బ్లడీ రోమియో' సినిమాల కారణంగా నేను ఎంచుకునే కథలపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ నా తర్వాత సినిమా ప్రకటన వస్తే అందరికీ నా ప్రయాణంపై స్పష్టత వస్తుంది. ఇప్పుడు చేస్తున్న సినిమాలకి భిన్నమైన ప్రయత్నాలతో త్వరలోనే తిరిగొస్తా" అన్నారు.

ఇది మా సినిమా అనడం కంటే కూడా, జనం సినిమా అనడమే సరైనదనీ.. ఇందులోని పాటల్ని, ప్రచార చిత్రాల్నీ అంతగా సొంతం చేసుకున్నారన్నారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. "తిరుగుబాటుతో కూడిన భావోద్వేగ ప్రధానమైన సినిమా ఇది. ఒక సవారీ జాతి కథ. 'పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది' అనేది కాళోజీ మాట. అలా దేశం కోసం కొట్లాడిన వాళ్లని ఈ దేశంతోనే సంబంధం లేదన్నప్పుడు.. ఏం చేయాలో తెలియక తిరుగుబాటు చేస్తారు. వాళ్ల కథే ఇది. ఇందులో భావోద్వేగాలే ప్రధానం" అన్నారు శ్రీకాంత్ ఓదెల. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ "ఈ నిర్మాణ వ్యయం అంచనాల్ని మించినా నేను సంతోషంగానే ఉన్నా. ముందస్తు ప్రదర్శనలు ఉంటాయి. టిక్కెట్ ధరల విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు" అన్నారు.



## రామ్‌తో సంయుక్త

రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో-నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ', 'స్లమ్ డాగ్', 'హైందవ', 'ది బ్లాక్ గోల్డ్' చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.

## ఆ మార్పునకు సిద్ధంగా ఉన్నా!



"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పుడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తూనే అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. భవిష్యత్తులో కూడా బలమైన మహిళా ప్రాధాన్య పాత్రలు కలిగిన చిత్రాలొస్తాయి" అని చెప్పింది.

## మోహిని నుంచి.. ఓ చిన్న రిక్వెస్ట్

వదిన... ఒక స్వచ్ఛమైన, కల్తీ లేని వందశాతం అసలైన హారర్ సినిమా రకం మంత్రగత్తె' అంటూ కుటుంబం మొత్తాన్ని కూర్చోబెట్టి.. తన వదిన ఎలాంటిదో చెప్పి నమ్మించాలని ప్రయత్నిస్తున్నాడో వ్యక్తి. మరి అతను చెప్పేది నిజమేనా? అందరూ అది నమ్మారో లేదో తెలియాలంటే 'నయీ నవేలి' సినిమా చూడాల్సిందే. యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దసరా పండగ సందర్భంగా అక్టోబరు 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం 'లేడీస్ అండ్ జెంటిల్‌మెన్.. మోహిని నుంచి ఒక చిన్న రిక్వెస్ట్' అనే వ్యాఖ్యలతో తాజాగా ఈ చిత్ర అధికారిక టీజర్‌ను ఇన్‌స్టాలో విడుదల చేసింది. ఇందులో 'మంత్రగత్తెనా? అంతేనా? ఇద్దరు మంత్రగత్తెలు, ముగ్గురు రాక్షసులు, నాలుగు దెయ్యాలని అల్పాహారంగా తింటాను.. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్ థింక్ బిగ్' అంటూ యామీ చెప్పిన డైలాగులు, సరికొత్త అవతారంలో భయపెట్టిన తీరు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రంలో ఒక సాధారణ కుటుంబ ప్రపంచాన్ని తలకిందులు చేసే కోడలు మోహిని పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది యామి.



---

## వైభవ్ లాంటి వాడిని ఒక్కడినైనా తయారు చేశారా?: పీఎస్‌ఎల్‌పై అక్రమ్ ఫైర్



పాకిస్థాన్ సూపర్ లీగ్‌పై ఆ దేశ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాడు. ఈ సందర్భంగా భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఉదహరిస్తూ పాక్ క్రికెట్‌కు చురుకలంటించాడు. అలాంటి కుర్రాడిని ఒక్కరినైనా పాక్ క్రికెట్‌కు అందించారా? అని ప్రశ్నించాడు. ఐపీఎల్‌తో వైభవ్ వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అక్రమ్ గతంలో ఐపీఎల్, పీఎస్‌ఎల్‌తో కలిసి పనిచేశాడు. రెండు లీగ్‌లను పోలుస్తూ పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ వ్యవస్థపై విమర్శలు గుప్పించాడు.

"పీఎస్‌ఎల్ మొదలై ఇప్పటికి పదేళ్లు అయింది. కానీ, ఒక్క సంచలన బ్యాటర్‌నైనా ఆ లీగ్ అందించిందా? అవును మేం బౌలింగ్‌లో మంచి ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చాం.. కానీ, బ్యాటింగ్‌లో గొప్ప టాలెంట్ ఉన్న ప్లేయర్లను పట్టుకోలేకపోయాం. భారత్‌లో వైభవ్ వంటి కుర్రాడు దొరికాడు. మరి మనం ఆ స్థాయికి ఎప్పటికి చేరుతాం? పాకిస్థాన్‌లో టెస్టు క్రికెట్ బతకాలంటే క్లబ్ క్రికెట్‌ను పునరుద్ధరించాలి. ప్రతిభ కలిగిన ప్లేయర్లు ఎక్కువగా అక్కడ్నుంచే వస్తున్నారు. కరాచీ, లాహోర్‌లో భారీగా ఖర్చు చేయాలి. అప్పుడే పాక్ జాతీయ జట్టుకు నాణ్యమైన ప్లేయర్లు వస్తారు" అని వసీం అక్రమ్ తెలిపాడు.

**అఫ్గాన్‌తో సిరీస్‌లో వైభవ్ ఆడతాడా? లేదా?**

అఫ్గానిస్థాన్‌తో ఆదివారం నుంచి మూడు టీ20ల సిరీస్ మొదలుకానుంది. అయితే, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇందులో ఆడే అవకాశాలు తక్కువనేని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. వరల్డ్ కప్ త్రయం అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ ఆడే నేపథ్యంలో వైభవ్‌కు ఛాన్స్ కష్టమే. అయితే, ఇషాన్‌కు ప్రాక్టీస్ సమయంలో గాయమైన సంగతి తెలిసిందే. ఒకవేళ అతడు ఫిట్‌గా లేకపోతే వైభవ్‌కే అవకాశం రావచ్చు.

## అరుదైన హ్యాట్రిక్ హీరోతో సంచలన ప్లేయర్ 'ఫైనల్' పోరు

యూఎస్ ఓపెన్ 2026 ఎడిషన్‌చివరి అంకానికి చేరుకుంది. ఫైనల్‌లో తలపడే ప్రత్యర్థులు ఎవరో తేలిపోయింది. కార్లోస్ అల్కరాస్ వంటి స్టార్ ప్లేయర్‌నే ఓడించి సంచలన ప్రదర్శనతో సెమీస్‌కు దూసుకొచ్చిన బెన్ షెల్టన్ ఇక్కడా దూకుడు ప్రదర్శించాడు. అద్భుతంగా ఆడి 4-6, 6-3, 6-3, 7-5 తేడాతో టియాఫోపై గెలిచి ఫైనల్‌కు చేరాడు. మరోవైపు ఆరేళ్ల తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ అడుగు పెట్టాడు. సెమీస్‌లో జ్వెరెవ్ 6-3, 7-6 (9/7), 7-6 (8/6) తేడాతో కచనోవ్‌పై విజయం సాధించాడు. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగనుంది.

**సంచలన ఆటతో..**

అమెరికాకు చెందిన 23 ఏళ్ల బెన్ షెల్టన్ ఆటే ఈ యూఎస్ ఓపెన్‌కు హైలైట్. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో టాప్ ప్లేయర్ అల్కరాస్‌పై అద్భుత విజయం సాధించాడు. తాను ఇక్కడి వరకూ ఏదో లక్ మీద రాలేదని.. తన కష్టంతోనే వచ్చానని సెమీస్‌లో నిరూపించాడు. తొలి సెట్ టియాఫో గెలిచినా.. బెన్ ఏమాత్రం బెణకలేదు. రెండో సెట్ నుంచి అతడు ఆడిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. వరుసగా మూడు సెట్లను గెలిచిన బెన్ తన ప్రత్యర్థికి అవకాశం లేకుండా చేశాడు. వీరిద్దరి మధ్య ఈ మ్యాచ్ దాదాపు మూడున్నర గంటలపాటు సాగింది. ఇప్పటి వరకు తన కెరీర్‌లో యూఎస్ ఓపెన్ సెమీస్ వరకూ బెన్ చేరాడు. తొలిసారి ఫైనల్‌లో అడుగు పెట్టాడు.




**హ్యాట్రిక్ సాధించిన జ్వెరెవ్**

జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆరేళ్ల తర్వాత యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరాడు. చివరిసారిగా 2020లో డొమినిక్ థీమ్ చేతిలో పరాజయం చవిచూశాడు. ఇప్పుడు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అరుదైన హ్యాట్రిక్‌ను సాధించాడు. ఒకే ఏడాదిలో మూడు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌కు చేరిన ప్లేయర్‌గా ఘనత నమోదు చేశాడు. ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలిచిన అతడు.. వింబుల్డన్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఇప్పుడు యూఎస్ ఓపెన్ సెమీస్‌లో కచనోవ్‌ను ఓడించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. కచనోవ్ గట్టిగా ప్రతిఘటించినా జ్వెరెవ్ మాత్రం పట్టువదల్లేదు. ప్రత్యర్థికి ఒక్క సెట్‌నూ ఇవ్వకుండా విజయం సాధించాడు.

## జూనియర్ ఆసియా కప్.. అమ్మాయిలూ ఫైనల్‌కు వచ్చేశారు..!



భారత జూనియర్ హాకీ జట్లు అదరగొట్టేస్తున్నాయి. జూనియర్ ఆసియా కప్‌లో ఇప్పటికే పురుషుల జట్టు ఫైనల్‌కు చేరుకోగా.. తాజాగా మహిళా జట్టూ అదే బాటపట్టింది. సెమీస్‌లో సౌత్ కొరియాపై భారత్ విజయం సాధించింది. గత మ్యాచులతోపోలిస్తే ఈసారి టీమ్‌ఇండియాకు కాస్త పోటీ ఎదురైంది. అయినా సరే 5-1 తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. చైనా - జపాన్ జట్ల మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో భారత్ టైటిల్ పోరులో తలపడనుంది.

**సుప్రియ హ్యాట్రిక్..**

అంతకుముందు క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్‌ను 19-0 తేడాతో చిత్తు చేసిన భారత్.. అదే ఊపుతో సెమీస్‌లోనూ సౌత్ కొరియాపై విజృంభించింది. సుప్రియ హ్యాట్రిక్, మధు సిదార్, సుఖ్వీర్ కౌర్ తలో గోల్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. దక్షిణ కొరియా తరఫున యురి జెంగో ఒక గోల్ చేసింది.

## మన ప్రత్యర్థి లంక

మహిళల ఆసియా కప్ టీ20 టోర్నీ ఫైనల్లో భారత్‌ను శ్రీలంక ఢీకొనబోతోంది. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీఫైనల్లో ఆ జట్టు.. 4 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పాక్ 5 వికెట్లకు 130 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాతిమా సనా (47 నాటౌట్; 36 బంతుల్లో 4×4, 2×6) టాప్‌స్కోరర్. లంక బౌలర్లలో చమరి ఆటపట్టు (2/24), చముడి ప్రబోధ (2/25) రాణించారు. ఫాతిమా సనా (4/38) బంతితోనూ విజృంభించడంతో ఛేదనలో తడబడ్డ లంక ఒక దశలో 33/4తో నిలిచింది. ఈ దశలో హర్షిత సమరవిక్రమ (36; 31 బంతుల్లో 2×4), కవిశ దిల్హార (33; 33 బంతుల్లో 4×4) 67 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నడిపించారు. వీళ్లిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. నీలాక్షిక (18 నాటౌట్), కౌశిని (10 నాటౌట్) జట్టును గెలిపించారు. భారత్, లంక మధ్య ఆదివారం ఫైనల్ జరుగుతుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945